క్లుప్తంగా

వేంకటేశ్వరస్వామికి విశేష పూజలు



పూజల్లో పాల్గొన్న భక్తులు

రుద్రవరం: మండల పరిధిలోని కొండమాయపల్లె పంచాయతీ వెలగలపల్లె పొలిమేరలో వెలసిన లక్ష్మీగోదాదేవి సమేత వాసాపురం వేంకటేశ్వర స్వామికి శనివారం భక్తులు విశేష పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకుల ఆధ్వర్యంలో అర్చకులు వారనాసి గోపిశర్మ, శివ ఆలయంలో వెలసిన స్వామి అమ్మవార్లకు ఉదయాన్నే నిత్యపూజలు గావించారు. అనంతరం స్వామి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. స్థానికులతో పాటు వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తాదులు పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



ఆర్.జంబులదిన్నె అభయాంజనేయస్వామి ఆలయంలో భక్తులకు హారతిస్తున్న అర్చకులు

ఉయ్యాలవాడ: మండలంలోని సుద్దమల్ల, ఆర్.జంబులదిన్నె, ఉయ్యాలవాడ, ఇంజేడు గ్రామాల్లో వెలిసిన ఆలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. లక్ష్మీనరసింహ కంబగిరిస్వామి, అభయాంజనేయస్వామి, లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు వేకువజామునే ప్రత్యేక అభిషేకాలు, కుంకుమార్చన, ఆకుపూజ నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అర్చకులు లక్ష్మణస్వామి, కమలేష్‌శర్మ, అనంతయ్య, భాస్కరశర్మలు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకించండి



ఎంపీకి వినతి పత్రం అందజేస్తున్న ముస్లిం జేఏసీ నాయకులు

నంద్యాల(వ్యవసాయం):వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా ఓటు వేయాలని కోరుతూ ఎంపీ శబరికి నంద్యాల ముస్లిం జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు శనివారం కార్యాలయం వద్ద అందజేశారు. నాయకులు అబులైజ్, అబ్దుల్లా రషాదీ మాట్లాడుతూ ఈనెల 10వ తేదీన పార్లమెంట్‌లో ప్రవేశపెట్టబోయే వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకించాలని కోరారు. వక్ఫ్‌బోర్డు లో ముస్లిం యేతర సభ్యులను చేర్చడం, జిల్లా కలెక్టర్లకు అధికారం కట్టబెట్టడం, వక్ఫ్ సృష్టిపై పరిమితులు, వక్ఫ్‌బై యూజ్ వ్యవస్థను రద్దు చేయడం తగదన్నారు. అబ్దుల్‌సమ్మద్, సద్దాంహుసేన్, బాషా, జాకీర్, ఉస్మాన్, ఫక్రుద్దీన్, ఎజాజ్, రహంతుల్లా, అక్బర్, అలీం పాల్గొన్నారు.

17 నుంచి గోవిందపల్లెలో జపయజ్ఞ సప్తాహం

శిరివెళ్ల: ఈ నెల 17 నుంచి 24 వరకు గోవిందపల్లెలోని సీతారామాంజనేయ స్వామి దేవస్థానంలో అఖండ శ్రీరామ జయరామ నామ జప యజ్ఞ సప్తాహ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు విశ్వ హిందూ పరిషత్ జిల్లా ఉపాధ్యక్షుడు వైపీ రామయ్య శనివారం తెలిపారు. వారం పాటు జరగనున్న కార్యక్రమాలలో పరిషత్ ప్రముఖులు, వివిధ పీఠాల అధిపతుల ప్రవచనాలు ఉంటాయన్నారు. 23న పద్మశ్రీ, సహస్రావధాని డాక్టర్ గరికపాటి నరసింహారావు ప్రవచనం ఉంటుందన్నారు. చివరి రోజు 24న శారదా పీఠం కాకనూరు స్వాముల ఆధ్వర్యంలో పూర్ణాహుతి, శోభా యాత్ర జరుగుతాయన్నారు.

హక్కులను కాలరాస్తున్న బీజేపీ

నంద్యాల(అర్బన్): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఈడీ అధికారులతో దాడులు చేయిస్తూ ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తోందని, ఇటీవల నంద్యాల జిల్లా కేంద్రంలో ఎస్‌డీపీఐ కార్యాలయంపై ఈడీ అధికారులు చేసిన దాడులే నిదర్శనమని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు చింతలమోహన్‌రావు విమర్శించారు. స్థానిక కార్యాలయంలో శనివారం పార్టీ నాయకులతో కలిసి ఆయన మాట్లాడుతూ ఢిల్లీలో ఎస్‌డీపీఐ జాతీయ అధ్యక్షుడి అరెస్ట్‌ను నిరసిస్తూ ఆ పార్టీ నాయకులు నిరసన తెలిపినందుకు ప్రతీకారంగా కేంద్ర ప్రభుత్వం ఎస్‌డీపీఐ కార్యాలయాలపై దాడులు చేయడం సరైంది కాదన్నారు. స్వతంత్ర దర్యాప్తు సంస్థ అయిన ఈడీ ఇటువంటి దాడులు చేస్తూ నాయకులను బెదిరింపులకు గురి చేయడం తగదన్నారు. నాయకులు చింతలయ్య, ప్రసాద్, జాకీర్, రవి పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా హోమ పూజలు

కోవెలకుంట్ల: స్థానిక గాంధీసెంటర్‌లో నూతనంగా నిర్మించిన అన్నపూర్ణ సమేత కాశీవిశ్వనాథస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు రెండో రోజుకు చేరుకున్నాయి. శనివారం రుద్రాభిషేకం, మహాస్నపనం, గణపతి, నవగ్రహ, రుద్ర, దేవి పంచసూక్త లక్ష్మీనారాయణ, సుదర్శన హోమాలు నిర్వహించారు.



దొర్నిపాడు వెలుగు కార్యాలయంలో పొదుపు మహిళలకు సన్మానం



యర్రగుంట్లలో జీటీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థినులకు బహుమతులను అందచేస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ ఇంద్రావతి,



నంద్యాల మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్‌ను సన్మానిస్తున్న దృశ్యం



రుద్రవరంలో చీరలు పంపిణీ చేస్తున్న ప్రార్థనా మందిరం నిర్వాహకుడు పేరుసోముల సుదర్శన్, నంద్యాల గుడ్ షపర్డ్ ప్రిన్సిపాల్ జెస్సీపాల్

- ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం
- పలువురు మహిళలకు సన్మానం

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



బహుమతులు అందుకున్న విద్యార్థినులతో వాసవీ మహిళా మండలి సభ్యులు



పేద మహిళలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న దాల్‌మిల్ అమీర్



కేక్ కట్ చేసి సంబరాలు చేసుకుంటున్న మున్సిపల్ చైరపర్సన్ మాబున్నిసా, వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు



ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో మహిళలను సన్మానిస్తున్న దృశ్యం

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నంద్యాల, ఆళ్లగడ్డ నియోజకవర్గాల్లో శనివారం ఘనంగా నిర్వహించారు. రెడ్‌క్రాస్, ఐఎంఏ, వాసవీ క్లబ్, పలు ఉపాధ్యాయ సంఘాలు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి వివిధ రంగాల్లో పనిచేస్తున్న పలువురు మహిళా ఉద్యోగులను సన్మానించారు. ఆయా కార్యక్రమాల్లో సమాజాభివృద్ధి, కుటుంబ అభివృద్ధిలో మహిళల పాత్రను వక్తలు కొనియాడారు. మహిళా చట్టాల గురించి న్యాయవాది హృదయకృష్ణ అవగాహన కల్పించారు. ఆధునిక యుగంలో మహిళలు అన్నిరంగాల్లో రాణిస్తుండటంతో పాటు కీలకపాత్రను పోషిస్తుండటాన్ని వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు పలు రకాల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

– సాక్షి నెట్‌వర్క్



తహసీల్దార్ ప్రియదర్శిని సన్మానిస్తున్న రెవెన్యూ మహిళా ఉద్యోగులు



అడిషనల్ ఎస్పీ జావలి ఆల్ఫోన్స్‌ను సన్మానిస్తున్న దృశ్యం



వివిధ రంగాల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థినులతో ఆళ్లగడ్డ డీఎస్పీ ప్రమోద్



ఆర్టీసీ మహిళా ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న ఆర్ఎం రజియా సుల్తానా



కేక్ కట్ చేస్తున్న దృశ్యం



ఐఎంఏ ఆధ్వర్యంలో విశిష్ట సేవలు అందించిన మహిళలకు పురస్కారాలు అందజేస్తున్న దృశ్యం



రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో వైద్యులను సన్మానిస్తున్న దృశ్యం

వేడుకగా ఆలయ వార్షికోత్సవం





జ్యోతులను తీసుకొస్తున్న మహిళలు, సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని జగజ్జననీ నగర్‌లో వెలసిన జగజ్జననీ ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం భక్తిశ్రద్ధలతో సామూహిక సహస్ర నామ కుంకుమార్చన నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి మూలవిరాట్‌కు ఉదయాన్నే పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించి పట్టువస్త్రాలతో అలంకరించారు. భక్తులు తీసుకొచ్చిన వివిధ రకాల పండ్లతో ఆలయ గోపురాన్ని, ఆలయ ఆవరణలో అలంకరించారు. దుర్గా ఫ్రెండ్స్ యూనిట్ సభ్యుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

అహోబిలం బ్రహ్మోత్సవాలకు తిరునాల బండి



అహోబిలానికి ఊరేగింపుగా వెళ్తున్న తిరునాల బండి

నంద్యాల(వ్యవసాయం): అహోబిలంలో జరిగే నరసింహస్వామి బ్రహ్మోత్సవాలకు మూలసాగరం నుంచి తిరునాల బండిని బీజేపీ జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు పూజలు చేసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఏటా లక్ష్మిరెడ్డి, ఉపేంద్రనాథరెడ్డి, స్వామిరెడ్డి ఆధ్వర్యంలో మూలసాగరం నుంచి ఎద్దుల బండిపైన ఊరేగింపుగా వెళ్లి ట్రాక్టర్‌లో భక్తుల ద్వారా సేకరించిన నిత్యావసర సరుకులతో బ్రహ్మోత్సవాల్లో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేస్తామన్నారు.

క్రీడాకారిణికి సన్మానం



క్రీడాకారిణికి మెమొంటో అందజేస్తున్న కలెక్టర్, జేసీ

నంద్యాల(న్యూటౌన్): పట్టణానికి చెందిన చిన్మయి శ్రేయ అనే క్రీడాకారిణి ఫెన్సింగ్ పోటీల్లో రాష్ట్ర స్థాయి పోటీల్లో సిల్వర్ మెడల్ సాధించింది. దీంతో శనివారం జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఎల్‌కేఆర్ ఫంక్షన్ హాల్‌లో జిల్లా కలెక్టర్ రాజకుమారి, జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ క్రీడాకారిణికి మెమొంటో అందజేశారు. జాతీయ స్థాయి ఫెన్సింగ్ పోటీలకు ఎంపిక కావడం అభినందనీయమన్నారు.

కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వండి



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు జమ్మన్న

నంద్యాల(అర్బన్): బేడ, బుడగ జంగాల వారికి 17ఏళ్లగా కులధ్రువీకరణ పత్రాలు అందక విద్యా, ఉద్యోగాల్లో తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని, బేడ, బుడగ జంగాల సంఘం జిల్లా అధ్యక్షుడు జమ్మన్న తెలిపారు. స్థానిక కార్యాలయంలో శనివారం బుడగ జంగం నాయకుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు కూటమి నాయకులు బేడ, బుడగ జంగాలను ఎస్సీలుగా గుర్తించి సర్టిఫికెట్లను అందిస్తామని హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చి 9 మాసాలు అవుతున్నా కుల ధ్రువీకరణ పత్రాల పంపిణీపై చర్యలు చేపట్టలేదన్నారు. 2008 నుంచి కుల ధ్రువీకరణ పత్రాలు లేక అన్ని రంగాల్లో బేడ, బుడగ జంగాలు వెనుకబడి పోయాయన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పలు పథకాలు అందాయని, ఎస్సీ జాబితాలో చేర్చాలని శాసనసభలో ఆమోదించి పార్లమెంట్‌కు పంపారన్నారు. నాయకులు మీసాల పుల్లయ్య, రాముడు, సుంకన్న, ఎల్లప్ప, సుధాకర్, మల్లి, సుబ్బరాయుడు, పుల్లయ్య, జమయ్య పాల్గొన్నారు.

బాల్‌బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం

కోవెలకుంట్ల: పట్టణంలోని సంస్కృత పాఠశాల క్రీడామైదానంలో శనివారం రాయలసీమ స్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభమయ్యాయి. పోటీలను రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సతీమణి బీసీ ఇందిరమ్మ ప్రారంభించారు. రాయలసీమలోని నాలుగు ఉమ్మడి జిల్లాల నుంచి 30 జట్లు పోటీల్లో పేర్లు నమోదు చేసుకున్నట్లు నిర్వాహకులు పెద్దబాబు, మురళీమోహన్ తెలిపారు. విజేతగా నిలిచిన జట్టుకు రూ. 15వేలు, రన్నర్స్ జట్టుకు రూ. 12 వేలు, ఆ తర్వాత వరుసగా రూ. 10 వేలు, రూ. 8 వేలు, రూ. 5 వేలు చొప్పున ప్రదానం చేస్తామన్నారు.

హుండీలు చోరీ



హుండీని పగలగొట్టిన దృశ్యం

రుద్రవరం: స్థానిక భాస్కర నందీశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలోని బ్రహ్మంగారి గుడి, పక్కనే ఉన్న సాయి బాబా కాశీరెడ్డి నాయన ఆశ్రమాల్లోని హుండీని గుర్తుతెలియని వ్యక్తులు దొంగలించారు. ఆయా ఆలయాల నిర్వాహకులు తెలిపిన వివరాల మేరకు.. దినచర్యలో భాగంగా శుక్రవారం సాయంత్రం ఆలయాల్లో పూజా కార్యక్రమాలు పూర్తికాగానే తలుపులకు తాళాలు వేశారు. శనివారం ఉదయం పూజా కార్యక్రమాలు చేసేందుకు పూజారులు వెళ్లగా బ్రహ్మంగారి గుడిలోని హుండీని పగలగొట్టి సొమ్మును తీసుకున్నారు. అనంతరం పక్కనే ఉన్న సాయికాశీరెడ్డినాయన హుండీని ఎత్తుకెళ్లారు. ఈవిషయంపై రుద్రవరం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఆలయాల నిర్వహకులు తెలిపారు.

సద్వినియోగం చేసుకోండి

నంద్యాల(అర్బన్): ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీ బైరెడ్డి శబరి తెలిపారు. స్థానిక శ్రీనివాసనగర్‌లోని రైతుబజార్‌లో బలపాల రామలక్ష్మమ్మకు చెందిన ఫిష్ మోడల్ రెస్టారెంట్‌ను ప్రారంభించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఎంపీ మాట్లాడుతూ రూ.50లక్షల వ్యయంతో అన్ని రకాల ఫిష్ ఐటమ్స్ అందించే పీఎం మత్స్య సంపద యోజన పథకంలో రూ.20 లక్షల సబ్సిడీ లభిస్తుందన్నారు. ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం అందించే ఈ పథకాన్ని మహిళలు సద్వినియోగం చేసుకొని అభివృద్ధి సాధించాలని కోరారు. కార్యక్రమంలో ఉమ్మడి కర్నూలు జిల్లా మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు నవీన్‌కుమార్, ఇన్‌చార్జి ఏడీ పామన్న పాల్గొన్నారు.

పని దినాలు పెంచాలి

నంద్యాల(అర్బన్): ఉపాధి హామీ పని దినాలను 200 రోజులకు పెంచాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరరావు కోరారు. సమ్మర్ అలవెన్స్‌తో పాటు పెండింగ్ బిల్లులు సకాలంలో అందేలా చూడాలన్నారు. మండలంలోని పాండురంగాపురం, చాపిరేవుల గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను సీఐటీయూ జిల్లా కార్యదర్శి బాలవెంకట్‌తో కలిసి పరిశీలించారు. నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో 2 కోట్ల మంది పేదలు గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్నారన్నారు. ఉపాధి అవకాశాలు లేక ఇబ్బందులు పడుతున్న వారికి పథకం కింద 200 రోజుల పనిదినాలు కల్పించి ఆదుకోవాలన్నారు. ఉపాధి కూలీల సమస్యల పరిష్కారానికి ఈనెల 12న నిర్వహించే మహా ధర్నాకు కూలీలు హాజరు కావాలని పిలుపునిచ్చారు.

జయప్రదం చేయండి

నంద్యాల(న్యూటౌన్): మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 11వ తేదీన విజయవాడలో జరిగే మహా ధర్నాను జయప్రదం చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్, ఏఐటీయూసీ పట్టణకార్యదర్శి శ్రీనివాసులు, ఓబులేసు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ రంగంలో కాంట్రాక్ట్ విధానాన్ని ప్రవేశపెట్టేందుకు ప్రయత్నిస్తుందన్నారు. వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు రంజిత్, ప్రతాప్, శివరాం, మస్తాన్ పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌కు విశేష స్పందన



కక్షిదారులతో మాట్లాడుతున్న న్యాయమూర్తి రాజేంద్రబాబు

ఆళ్లగడ్డ: జాతీయ లోక్ అదాలత్‌లో ఎలాంటి సమస్యలనైనా రాజీ మార్గం ద్వారా సకాలంలో పరిష్కరించుకోవచ్చని అదనపు జిల్లా న్యాయమూర్తి రాజేంద్రబాబు అన్నారు. స్థానిక కోర్టు ఆవరణలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌కు విశేష స్పందన లభించింది. ఇందులో 88 కేసులు పరిష్కారం అయ్యాయి. రూ 53.13 లక్షలు కక్షిదారులకు పరిహారంగా అందజేశారు. జడ్జి మాట్లాడుతూ లోక్ అదాలత్ ద్వారా ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న సమస్యలను ఇరువర్గాల ఆమోదంతో పరిష్కరించి ఇరువురికి న్యాయం జరిగేలా చూస్తామన్నారు. లోక్ అదాలత్‌లో పరిష్కారమైన కేసులపై పైస్థాయిలో కోర్టులకు వెళ్లాల్సిన అవసరం లేదన్నారు.

బీజేపీ మతోన్మాద విధానాలపై ప్రజల్లో చైతన్యం పెంచాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి

నంద్యాల(న్యూటౌన్): బీజేపీ మతోన్మాద వ్యతిరేక విధానాలు, కార్పొరేట్ అనుకూల ఆర్థిక విధానాలను ప్రతిఘటించేలా ప్రజలను చైతన్యం చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ప్రభాకర్‌రెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని సీపీఎం నరసింహయ్య భవన్‌లో నంద్యాల జిల్లా పార్టీ కార్యకర్తల సమావేశం ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఏసురత్నం అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ ట్రంప్ అమెరికా అధ్యక్షుడు అయ్యాక భారతీయుల స్వేచ్ఛను హరింపజేస్తుంటే ప్రధాని మోదీ నోరు విప్పకపోవడం విచారకరమన్నారు. బీజేపీ రాష్ట్రాల హక్కులను హరించి వేస్తుందని, ప్రజా మతోన్మాద చర్యలను ప్రోత్సహిస్తూ ప్రజల మధ్యన చిచ్చుపెడుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను రైతుల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. ఈనెల 17వ తేదీ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా సీపీఎం ఆధ్వర్యంలో ప్రజా చైతన్య యాత్రలను నిర్వహిస్తామని విజయవంతం చేయాలని కోరారు. సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్ కుమార్, నాగరాజు, నాగేశ్వరరావు, రామచంద్రుడు, నరసింహనాయక్ పాల్గొన్నారు.



ఉయ్యాలవాడ ఈద్గా వద్ద మందుబాబులు తాగి పడవేసిన మందు సీసాలు, వాటర్ ప్యాకెట్లు



ఉయ్యాలవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో తాగి పడవేసిన బీరు బాటిళ్లు

మందుబాబుల బరి తెగింపు

ఉయ్యాలవాడ : కూటమి ప్రభుత్వంలో మందుబాబులు బరి తెగిస్తున్నారు. గ్రామాలలో విచ్చలవిడిగా మద్యం లభ్యం అవుతుండడంతో బహిరంగంగా తాగుతూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. రెండవ శనివారం, ఆదివారం, సెలువు వస్తే చాలు ప్రభుత్వ కార్యాలయాలు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో వున్న క్రీడా మైదానాలు, చివరకు ముస్లింలు ప్రార్థన చేసుకునే ఈద్గాలను కూడా అడ్డాగా చేసుకుని పట్ట పగలే చెట్లకింద దర్జాగా సిట్టింగ్ వేస్తున్నారు. మరసటి రోజు కార్యాలయాలకు విధులకు హాజరయ్యే ఉపాధ్యాయులు, ఉద్యోగులు, ముఖ్యంగా మహిళా ఉద్యోగులు ఖాళీ మద్యం సీసాలు చూసి భయాందోళనకు గురవుతున్నారు. మండల కేంద్రమైన ఉయ్యాలవాడ గ్రామ సమీపంలో ముస్లింల ప్రార్థనా స్థలం ఈద్గా వద్ద మందుబాబులు మద్యం తాగి ఖాళీ సీసాలు, వాటర్ ప్యాకెట్లు గుట్టలు గుట్టలుగా ఎక్కడ పడితే అక్కడ పడవేసి వాతావరణాన్ని కలుషితం చేస్తున్నారు. పవిత్రమైన రంజాన్ మాసం ప్రారంభం కావడంతో పండుగ రోజు ప్రత్యేక ప్రార్థనలు చేసేందుకు ఈద్గాను పరిశీలించేందుకు శనివారం వెళ్లిన ముస్లిం పెద్దల కంట మద్యం సీసాలు కనపడడంతో ఆందోళనకు గురయ్యారు. ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో మద్యం సీసాలను చూస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలు ఎక్కడ మద్యానికి బానిసలుగా మారుతారోననే భయం వారిలో నెలకొంది. పోలీస్ స్టేషన్‌కు కిలో మీటర్ దూరంలోనే ఇలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరుగుతూ వుంటే ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని, గ్రామస్తులతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు కూడా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గిరిజనులకు అన్యాయం చేస్తే సహించం

నంద్యాల(న్యూటౌన్): గిరిజనులకు అన్యాయం చేసేలా వ్యవహరించడం దుర్మార్గమని ఆల్ ఇండియా బంజార సంఘ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బాలునాయక్, జీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాజునాయక్, దళిత గిరిజన ఐక్యసంఘం రాష్ట్ర అధ్యక్షుడు స్వామినాయక్‌లు అన్నారు. శనివారం ఆల్ ఇండియా బంజార సంఘ్‌కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గిరిజన ఓట్లతో గెలిచిన కూటమి నేతలు అవసరం తీరిందని, తమ జాతికి అన్యాయం చేస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. ఎమ్మెల్యే సింధూరారెడ్డి అసెంబ్లీలో చేసిన వ్యాఖ్యాలను ఖండించారు. వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని ప్రతిపాదించడం తగదన్నారు. నంద్యాల కూటమి ఎంపీ బైరెడ్డి శబరి కూడా కేంద్ర మంత్రి అవిమిత్‌షాను కలిసి వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చమని కోరడం దారుణమన్నారు.